ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
బుధవారం 27 మార్చి 2024






మహేశ్వరంలో బీఆర్‌ఎస్‌కు మరో షాక్

- పార్టీ వీడి కాంగ్రెస్‌లో చేరిన ఇన్‌చార్జి ఎంపీపీ దంపతులు
- కండువాలు వేసి ఆహ్వానించిన పార్టీ ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి



ఇన్‌చార్జి ఎంపీపీ సునీతఅంద్యానాయక్ దంపతులకు కాంగ్రెస్ కండువా కప్పుతున్న కేఎల్లార్

మహేశ్వరం, మార్చి 26 : అసెంబ్లీ ఎన్నికల అనంతరం ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీని వీడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా మహేశ్వరం మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీపీ సునీతఅంద్యానాయక్ దంపతులు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి లోక్‌సభ ఎన్నికల్లో విజయఢంకా మోగిస్తామని, మహేశ్వరంలో బీఆర్‌ఎస్ ఖాళీ అవడం ఖాయం కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్.సునీత దంపతులు, వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులకు తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో లక్ష్మారెడ్డి కండువాలు కప్పారు. కేఎల్లార్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు చేర్చేందుకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కష్టపడే కార్యకర్తలను పార్టీ మరవదన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్‌ఎస్ నాయకులు పదేళ్ల ఇబ్బందులకు గురిచేశారని, కానీ కాంగ్రెస్ శ్రేణులు ప్రజల పక్షాన పనిచేయాలన్నారు. త్వరలో ఇందిరమ్మ కమిటీలు వేసి ప్రభుత్వ పథకాలను అర్హులకు చేర్చుతామని, ఈ పనిలో కమిటీలదే కీలక బాధ్యతన్నారు. చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని, అందుకు నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకమేనని, ప్రతీ ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కె.రఘుమారెడ్డి, కూన యాదయ్య, ఈశ్వర్, ఎ.కృష్ణ, ఎ.సత్యానారాయణ, ఐ.నర్సింహాగౌడ్, పాండునాయక్, రాజు, కె.వరమేష్, కుమార్, జి.జంగయ్య, అంజయ్య, యాదయ్య, రాజు, నర్సింహ, మైసయ్య, లాజర్, సుభాష్ పాల్గొన్నారు.



అధికార కాంగ్రెస్‌లో అసంతృప్తి!

చేవెళ్ల ఆత్మీయ సమావేశంలో బట్టబయలు

కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి ముసలం బయటపడింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్‌ఎస్ నుంచి చేరికలను ప్రోత్సహించడంపై నేతలు అసంతృప్తిగా ఉన్నారు. చేవెళ్ల, మల్కాజ్‌గిరి టికెట్లు బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన వారికే కేటాయించడంపై కాంగ్రెస్ సీనియర్లలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. కాంగ్రెస్‌ను మోసం చేసిన వారిని, దొంగలను పార్టీలోకి తీసుకువస్తే మాలాంటి కార్యకర్తలు చచ్చిపోతారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

కాంగ్రెస్‌లో చాపకింద నీరులా ఉన్న అసమ్మతి చేవెళ్ల పార్లమెంట్ ఆత్మీయ సమావేశంలో బట్టబయలైంది. ప్రస్తుతం అధికార పార్టీలో చేరికలపై కాంగ్రెస్‌లో సీనియర్లు, కార్యకర్తల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. అయితే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు బహిరంగంగా సీనియర్ నేతలెవ్వరూ నోరు విప్పి మాట్లాడలేదు. కానీ లోలోపల కొందరు రగిలిపోతున్నారు. చేరికల సమయంలో కనీసం తమకు సమాచారం కూడా ఇవ్వకుండా కొత్తగా పార్టీలో చేరిన వారితోనే వ్యవహారాలన్నీ నడుపుతున్నారని సీనియర్లు గుర్రుగా ఉన్నారు. బీఆర్‌ఎస్ నుంచి చేరికలను ప్రోత్సహించడంపై అసంతృప్తిగా ఉన్న స్థానిక నేతలు బహిరంగంగా బయటపడలేదు. అయితే తాజాగా చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ నేతల ఆత్మీయ సమావేశంలో అసమ్మతి బట్టబయలైంది. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేకెత్తించాయి. పార్టీ అధినాయకత్వం డోర్లు తెరుస్తామంటూ పదే పదే ప్రకటిస్తోంది. కాంగ్రెస్‌ను మోసం చేసిన వారిని, దొంగలను లోపలికి తీసుకువస్తే మాలాంటి కార్యకర్తలు చచ్చిపోతారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు స్పీకర్ ప్రసాద్‌కుమార్, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేల సమక్షంలో కేఎల్లార్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. కేఎల్లార్ ఇలా మాట్లాడుతున్న సమయంలో అక్కడ ఉన్న కార్యకర్తలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వ్యక్తం చేస్తూ చప్పట్లు కొట్టడం విశేషం.

అభ్యర్థిని గెలిపించుకుంటాం

ఇదిలా ఉంటే.. ఏదీ ఏమైనా పార్టీ టికెట్ ఇచ్చిన అభ్యర్థిని గెలిపించే బాధ్యత మాత్రం తీసుకుంటామని ఈ సందర్భంగా కేఎల్లార్ చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి తాను మంచి మిత్రులమని, మా మధ్య విభేదాలు లేవని ఆయన స్పష్టం చేశారు. కొన్ని నెలల కింద రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తమవుతున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని అత్యంత కీలకమైన చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీలు నువ్వా-నేనా అన్నట్లుగా తలపడుతున్నాయి. ఈ రెండు స్థానాల్లో పోటీని ఈ మూడు పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి.

రెండు టికెట్లూ బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన వారికే..

అభ్యర్థుల ఎంపిక విషయంలో కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చేవెళ్ల పార్లమెంట్ సీటును బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి కేటాయించారు. అలాగే మల్కాజిగిరి స్థానాన్ని బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి భార్య, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి ప్రకటించారు. ఈ రెండు సీట్లు బీఆర్ఎఎస్ నుంచి వచ్చిన వారికే కేటాయించడంపై కాంగ్రెస్ సీనియర్లలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కాంగ్రెస్ ఉనికి లేకుండా చేయాలనుకున్న నేతలకు ఇప్పుడు కాంగ్రెస్ పిలిచి టికెట్లు ఇవ్వడంపై కొందరు నేతలు, కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో సీనియర్ నేతలు తమపై కేసులు పెట్టిన వారికి ఇప్పుడు ఎలా పనిచేయాలని ప్రశ్నిస్తున్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారిని గుర్తించకుండా అధికారం ఎక్కడ ఉంటే అక్కడ ఉండే వారిని పిలిచి టికెట్లు ఇవ్వడమేమిటనీ అడుగుతున్నారు. అయితే ఇప్పటి వరకు బహిరంగంగా నెతలెవ్వరూ దీనిపై మాట్లాడలేదు.

- సీఎం ఎదుటే చేరికలపై ప్రశ్నించిన కేఎల్లార్
- మోసగాళ్లను చేర్చుకుంటే మాలాంటి కార్యకర్తలు చచ్చిపోతారంటూ ఆవేదన
- కలకలం రేకెత్తించిన కేఎల్లార్ వ్యాఖ్యలు

సమావేశాలను పట్టించుకోని అసంతృప్త నేతలు

అసంతృప్తిగా ఉన్న నేతలు స్థానికంగా జరిగే సమావేశాలను కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. నిన్నమొన్నటి వరకు బద్ధవిరోధులుగా ఉండి తమపై కేసులు పెట్టించిన వారి కోసం ఇప్పుడు పనిచేయాలా? అని ప్రశ్నిస్తున్నారు. అయితే అదను చూసి అందరి సమక్షంలోనే కేఎల్లాఆర్ ఈఅంశాన్ని లేవనెత్తడం చర్చనీయాంశంగా మారింది. తరువాత మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నాయకత్వం నిర్ణయం ప్రకారమే టికెట్లు కేటాయింపు ఉంటుందని పనిచేసే కార్యకర్తలు, నేతలకు న్యాయం జరుగుతుందని హామీ ఇస్తూ ఇటీవల ఉమ్మడి జిల్లా నేతలకు నామినేటెడ్ పోస్టుల కేటాయింపును గుర్తు చేశారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, మార్చి 26 : పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి శశాంక అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలింగ్, అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఎవరికిస్తారనే విషయంపై అధికారులకు అవగాహనుండాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి, ఈ ప్రక్రియలో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి, సర్వీస్ ఓటర్లకు ఫారం-12 ఇచ్చి దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లో ఓటు వేసేలా ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ వేయడానికి వచ్చే ఇతర జిల్లా, ప్రాంత సిబ్బందికి ఒక రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తామన్నారు. చెల్లని పోస్టల్ బ్యాలెట్లు పడకుండా ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్వో పీడీ సంగీత, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కృష్ణారెడ్డి, చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్‌ను పూర్తిచేశారు. కలెక్టర్ శశాంక నేతృత్వంలో కలెక్టరేట్‌లో ఎన్ఐసీ హాల్లో ర్యాండమైజేషన్ నిర్వహించారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధి పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్ అధికారులు(పీఓ), ఏపీఓలను, ఓపీఓలను కేటాయించారు. రిజర్వ్ సిబ్బందిని కలుపుకొని జిల్లా పరిధి 8 సెగ్మెంట్లకు 16,536మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు.పీఓలు 4,076 మంది, ఏపీఓలు 3,968, ఓపీఓలు 7,952 మంది, మైక్రోఅబ్జర్వర్లు 540 మంది ఉన్నారు. పోలింగ్ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లతో ఏప్రిల్ 1, 2 తేదీల్లో పీవోలకు, ఏపీవోలకు పోలింగ్‌పై శిక్షణ ఇస్తామన్నారు. ట్రైనింగ్‌లో ప్రొజెక్టర్, ఈవీఎంలు తప్పనిసరిగా వాడాలని సూచించారు. జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఎన్ఐసీ అధికారి స్వర్ణలత, మ్యాన్‌పవర్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి శ్రీలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారి సైదులు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక అన్నారు. నీటి సమస్యపై ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు, 558 పంచాయతీల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా కార్యాచరణ రూపొందించాలన్నారు. ఆనంతరం ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. జిల్లాలో 40వేల టన్నుల ధాన్యం వస్తుందని, ధాన్యం కొనుగోలుకు 39 కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారి రాథోడ్, డీసీఎస్వో విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

పోలింగ్‌కు సర్వం సిద్ధం

షాద్‌నగర్ ఏఆర్వో పరిధిలో మూడు మున్సిపాలిటీలు, 10 మండలాలు, 171 మంది ఓటర్లు ›› ఏఆర్వో వెంకటమాధవరావు



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఏఆర్వో వెంకటమాధవరావు, ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్, మార్చి 26 : ఈ నెల 28న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఉప ఎన్నిక పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేశామని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ వెంకటమాధవరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం షాద్‌నగర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ బూత్‌ను ఏసీపీ రంగస్వామి, తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో బన్సీలాల్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు షాద్‌నగర్ ఏఆర్వో పరిధిలో మూడు మున్సిపాల్టీలు, పది మండల పరిషత్‌లు కలిపి 171 మంది ఓటర్లున్నారని చెప్పారు. ఉప ఎన్నికను సజావుగా నిర్వహించేందుకు నలుగురు పోలింగ్ ఆఫీసర్లు, 13మంది ఐడెంటిఫికేషన్ అధికారులతో పాటు సెక్టార్ అధికారిని నియమించినట్లు తెలిపారు. గురువారం ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు స్థానిక ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

భారీ బందోబస్తు : ఏసీపీ రంగస్వామి

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో 130 మంది సిబ్బందితో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి తెలిపారు. డీసీపీ ఆధ్వర్యంలో షాద్‌నగర్ ఏసీపీ, ఏడుగురు సీఐలు, 20మంది ఎస్సైలు, ఏఎస్సైలు, 103 మంది కానిస్టేబుళ్లు, సీఆర్‌పీఎఫ్ జవాన్లతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎవరైనా ఎలాంటి ఎలాంటి అలజడి సృష్టించినా చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు. ఓటరు ఓటు వేసిన తరువాత పోలింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోవాలని ఆయన సూచించారు.

ఎమ్మెల్సీ ఓటు.. బహు ఖరీదు!

- సాధారణ ఓటర్లను తీసిపోని ప్రజాప్రతినిధులు
- ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్లకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ బంపరాఫర్
- ఓటుకు రూ.3లక్షల నుంచి 5లక్షల వరకు ఇచ్చేందుకు ఒప్పందం
- కొన్నాళ్లుగా క్యాంపుల్లోనే ఓటర్లు
- రెండు పార్టీల నుంచీ భారీగా డబ్బందుకున్న ప్రజాప్రతినిధులు?

ఆమనగల్లు, మార్చి 26 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక రసవత్తరంగా మారింది. ఈ ఉప ఎన్నికను కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. 2022లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా బీఆర్‌ఎస్ నుంచి ఎన్నికైన తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన కసిరెడ్డి నారాయణరెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ తరఫున నవీన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఎమ్మెల్సీ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు బీఆర్‌ఎస్.., రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఈ స్థానంలో ఎలాగైనా గెలవాలని కాంగ్రెస్ గట్టి ప్రయత్నాలే చేస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మండల పరిషత్‌లు, మునిసిపాలిటీల నుంచి 1,439 మంది ఎమ్మెల్సీ ఓటర్లున్నారు. వీరిలో మూడింట రెండొంతుల మంది బీఆర్‌ఎస్ వారే ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో చాలా మంది బీఆర్‌ఎస్ ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీలు, మునిసిపాలిటీల కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. ఈ ఎమ్మెల్సీ స్థానాన్ని సునాయాసంగా దక్కించుకోవచ్చన్న ధీమాలో కాంగ్రెస్ ఉంది. ఈ నెల 28న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ నేపథ్యంలో కొన్ని రోజుల ముందే ఆయా పార్టీలు ఏర్పాటు చేసిన క్యాంప్‌ల నుంచి ప్రజాప్రతినిధులు జిల్లాకు చేరుకుంటున్నారు. కొందరు నేరుగా పోలింగ్ కేంద్రాలకే వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటర్లు చేజారకుండా ఉండేందుకు ఈ రెండు పార్టీలూ ఓటర్లకు భారీ నజరానాలు ముట్టజెబుతున్నట్లు సమాచారం.

ఆనందంలో స్థానిక ప్రజాప్రతినిధులు

కల్వకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఆమనగల్లు మున్సిపాలిటీ, మండలంలో 21 ఓట్లు, మాడ్గుల మండలంలో 15, తలకొండపల్లి మండలంలో 13, కడ్తాల మండలంలో 11, కల్వకుర్తి, మున్సిపాలిటీ, రూరల్ మండలంలో 35, వెల్దండ మండలంలో 13 మంది చొప్పున ఓటర్లు ఉన్నాయి. వీరిలో 64మంది ఎంపీటీసీ సభ్యులు, 37 మంది మున్సిపల్ కౌన్సిలర్లు, ఆరుగురు జడ్పీటీసీ సభ్యులు, ఒక ఎమ్మెల్యే అంతా కలిపి 108 మంది ఓటర్లు ఉన్నారు. కాగా ఉప ఎన్నిక ఈ సారి అత్యంత ఖరీదుగా మారింది. తమ పదవీ కాలం మరి కొన్ని నెలల్లోనే ముగియనున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక అందివచ్చిన అవకాశంగా ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు. ఎంతో కొంత డబ్బు సంపాదించుకునే అవకాశం దక్కిందని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ పదవీ కాలం చరమాంకంలో అందినకాడికి దండుకునే ప్రయత్నంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఉన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు సైతం ఖర్చుకు వెనకాడడం లేదు. ఒక్కో ఓటరుకు రూ.3లక్షల నుంచి 5లక్షలు వరకు ముట్టజెప్పేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఒప్పందంలో భాగంగా ఇప్పటికే ఓ పార్టీ అభ్యర్థి తరఫున ముఖ్య ప్రజాప్రతినిధుల ద్వారా ఒక్కో ఓటరుకు రూ.1.5లక్షల చొప్పున, మరో పార్టీ అభ్యర్థి తమ నాయకుల ద్వారా ఓటరుకు రూ.లక్ష చొప్పున చెల్లించినట్లు చర్చ జరుగుతోంది. మిగతా డబ్బు ఓటింగ్‌కు ఒక రోజు ముందు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. చాలా మంది ఓటర్లు రెండు పార్టీల నుంచి డబ్బు తీసుకొని ఆయా పార్టీలు ఏర్పాటు చేసిన క్యాంపుల్లో కుటుంబ సభ్యులతో కొందరు, వ్యక్తిగతంగా మరి కొందరు ఎంజాయ్ చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బీజేపీ సభ్యులకు కూడా కలిసొచ్చింది. రెండు పార్టీలూ ఓటర్లకు ఆఫర్ల మీద ఆఫర్లు ఇస్తున్నాయి. అయితే చాలా మంది ఓటర్లు ఎవ్వరినీ కాదనకుండా రెండు పార్టీల విందులు, వినోదాల్లో మునిగితేలుతున్నారు. ఇలాంటి వారు చివరకు ఎవరికి ఓటు వేస్తారోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పోటీలో ఉన్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులతో పార్టీల రహితంగా అందరూ సన్నిహితంగానే ఉంటున్నారు. కొన్ని మండలాల్లో బీఆర్‌ఎస్ సభ్యులు కాంగ్రెస్ అభ్యర్థి నుంచి, మరికొన్ని చోట్ల కాంగ్రెస్ ఓటర్లు బీఆర్‌ఎస్ అభ్యర్థి నుంచి డబ్బు తీసుకోకపోవడం ఇక్కడ గమనార్హం. దీంతో వారు సొంత పార్టీలకే ఓటు వేస్తారన్న నమ్మకం ఏర్పడింది. సొంత పార్టీ అభ్యర్థి నుంచి మాత్రమే వారు ఎంతోకొంత తీసుకున్నట్లు తెలుస్తోంది. క్యాంపుల్లో ఉన్న ఓటర్లు ఈ నెల 28న నేరుగా పోలింగ్ కేంద్రాల వద్దకే రానున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల పోరు నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్సీ ఉపపోరు జరుగుతోంది. పోటీలో ఉన్న అభ్యర్థులకు కూడా ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఇదిలా ఉంటే పౌరులు ఓటేస్తే గెలిచిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఎదుటి పార్టీకైనా, సొంత పార్టీకైనా ఓటు వేసేందుకు డబ్బు ఆశించడం విమర్శలకు తావిస్తోంది.



ఓటర్లకు పెరుగుతున్న డిమాండ్

కొత్తూరు : మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓటర్లకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోంది. ఒక్కో ఓటరుకు నిన్న, మొన్నటి వరకు రూ.5లక్షల నుంచి 10లక్షల వరకు సాగిన బేరసారాలు, క్యాంపులతో వేడెక్కాయి. ప్రస్తుతం ఓటుకు రూ.10లక్షల నుంచి రూ.13లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం అవుతోంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఆర్థిక బలవంతులు కావడంతో ఖర్చు ఎంతైనా భరించేందుకు సిద్ధమయ్యారనే చర్చ నడుస్తోంది. రెండు పార్టీల నాయకులు ఓటర్లను గోవా, ఇతర దక్షిణాది రాష్ట్రాలకు క్యాంప్‌లకు తరలించారు. ఎన్ని క్యాంపులు పెట్టినా, ఎంత మచ్చిక చేసుకున్నా పెద్ద మొత్తంలో డబ్బు ఇస్తేగానీ ఓట్లు రావనే ఆలోచనలో అభ్యర్థులుంటే.. డబ్బు ఇవ్వందే ఓటు వెయ్యం. అన్న చందంగా ప్రజాప్రతినిధులు తీరు ఉంది!










బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా సాయిగౌడ్

ధారూరు, మార్చి 26: బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా స్టేషన్ ధారూరుకు చెందిన సాయిగౌడ్‌ను నియమించారు. ఈ మేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్‌రెడ్డి మంగళవారం ప్రకటించిన బీజేవైఎం జిల్లా నూతన కమిటీలో మండలం నుంచి ఇద్దరికి చోటుకల్పించారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా అంతారం గ్రామానికి చెందిన నవభారత్ రెడ్డిని నియమించారు. మండలంలో బీజేపీ పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేస్తామని సాయిగౌడ్, నవభారత్ రెడ్డిలు ఈ సందర్భంగా తెలిపారు.





నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

● పంచాయతీ కార్మికుల ఆందోళన



తాండూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

తాండూరు రూరల్, మార్చి 26: మండలంలోని చంద్రవంచ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అధికారులు విచారణ చేపట్టాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం తాండూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. చంద్రవంచ గ్రామపంచాయతీలోని కార్మికుల వేతనాలు రూ.8500లు ఇస్తామని, కొందరివి దొంగసంతకాలు చేసుకుని, రూ.3వేలు, రూ.5వేలు ఇస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ గ్రామపంచాయతీలో మండల పంచాయతీ అధికారి రతన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు బాల్‌రాజ్, శివకుమార్‌లు కార్మికుల వద్ద నుంచి వేతన రూపంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. మరో ఏడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, జీవో నెంబర్-51ని సవరించి, ప్రభుత్వం పంచాయతీ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు భీమయ్య, వెంకట్, మాణిక్యమ్మ, వెంకటేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి అవినీతి జరగలేదు

చంద్రవంచ గ్రామపంచాయతీలో ప్రస్తుతం పంచాయతీ తీర్మానం మేరకే వేతనాలు పంపిణీ చేస్తున్నాం. నిబంధనల ప్రకారం రూ.19,500లు ఇవ్వాల్సి ఉండగా రూ.26వేల 500లు ఇస్తున్నాం. మాపై ఎలాంటి విచారణకైనా సిద్ధం. పంచాయతీలో ఎలాంటి అవినీతి జరగలేదు.

- రతన్‌సింగ్, మండల పంచాయతీ అధికారి









హంస వాహనసేవలో పాల్గొన్న భక్తులు

వైభవంగా హంస వాహనసేవ

తలకొండపల్లి, మార్చి 26 : మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవాలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ ధర్మకర్త లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ రోజు మంగళవారం అర్చకులు రామాచార్యులు, గోపాలాచార్యులు ఆధ్వర్యంలో పారాయణం, హంస వాహనసేవ, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, స్థానిక నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లురవి

దేశంలో కాంగ్రెస్ ప్రభంజనం

» నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి

కడ్తాల్, మార్చి 26 : దేశంలో కాంగ్రెస్ ప్రభంజనం మొదలైందని, లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించి కేంద్రంలో అధికారం చేపడుతుందని పీసీసీ ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి అన్నారు. ప్రజా వ్యతిరేకతను గ్రహించిన బీజేపీ అధికారాన్ని కాపాడుకోవడానికి నీచ రాజకీయాలకు ఒడిగట్టి ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తుందని మండిపడ్డారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణలతో కలసి మల్లు రవి పర్యటించారు. కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఖరారై తొలిసారిగా కడ్తాలకు వచ్చిన రవికి పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఉపాధ్యక్షుడు కల్లు రమణారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, గిరిజన సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమాన్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుర్రం కేశవులు, రవీందర్‌నాయక్, గూడూరు భాస్కర్‌రెడ్డి, కాలె మల్లయ్య, వెంకటేష్‌లు ఘనస్వాగతం పలికారు. ఈమేరకు ఆయన్ను సన్మానించారు. అనంతరం మల్లు రవి మాట్లాడుతూ దేశంలో ప్రజావ్యతిరేకతను గ్రహించిన మోదీ సర్కార్ కుట్ర రాజకీయాలకు తెరతీసిందన్నారు. దేశంలో 350కిపైగా స్థానాలను దక్కించుకొని రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో రాష్ట్రానికి ఒర గబెట్టిందేమీ లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాలు దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు కృష్ణ, తులసీరాం, బాలరాజు, మానయ్య, నరేష్‌నాయక్ తదితరులున్నారు.

శివశివా!

వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించేనా!



వికారాబాద్ శివసాగర్ చెరువు

» శివసాగర్ చెరువును శుద్ధితో పాటు.. యంత్రాల మరమ్మతులు చేపట్టేనా!

» వికారాబాద్ ప్రజల తాగునీటి కష్టాలు తీరేనా!

వికారాబాద్, మార్చి 26: ఎండలు ముదురుతున్నాయి... భూగర్భజలాలు అడుగంటుతున్నాయి.. జిల్లాలో తాగునీటి సమస్యలు తతెత్తుతున్నాయి. వికారాబాద్ జిల్లా ప్రాంతానికి శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను తీసుకొచ్చి శుద్ధి చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో జలాశయాలు అడుగుగంటుతుండడంతో రానున్న రోజుల్లో తాగునీటి కష్టాలు తప్పేటట్లు లేదు. ఈ క్రమంలోనే పాలకులు, అధికారులు మంచినీటి విషయంలో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎప్పుడు మిషన్ భగీరథ నీటికి బ్రేక్ పడిన వెంటనే ప్రజలకు ప్రత్యామ్నాయంగా నీరు అందించే మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది. వికారాబాద్ మున్సిపల్ పరిధి విషయానికొస్తే సుమారు లక్షకు పైగా జనాభా ఉన్న జిల్లా కేంద్రంలో మిషన్ భగీరథ నీటికి బ్రేక్ పడితే మంచినీటి అందించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదు. వికారాబాద్ పట్టణానికి ప్రత్యామ్నాయంగా శివసాగర్ చెరువు ఉన్నప్పటికీ దాన్ని ఉపయోగించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. శివసాగర్ చెరువు నుంచి నీటిని సరఫరా చేసే క్రమంలో ఫిల్టర్ బెడ్ వద్ద నీటిని శుద్ధి చేసే యంత్రాలను సరి చేయాల్సి ఉన్నా ఐదేళ్లుగా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గతంలో మరమ్మతులకు నిధులు కేటాయించినప్పటికీ వాటిని మధ్యవర్తులే మింగేయడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. వికారాబాద్ మున్సిపాలిటీలో పాలకులు, అధికారులు మధ్య సమన్వయం లోపించడంతో రాజకీయ నాయకుల మధ్య విభేదాలు తప్పా, ఇక్కడి ప్రజలు సమస్యలను పట్టించుకోవడం లేదు. మున్ముందు వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నం కానున్నాయి. వెంటనే శివసాగర్ చెరువులో శుద్ధితో పాటు ఫిల్టర్ బెడ్ వద్ద యంత్రాలకు మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. స్వార్థ రాజకీయాలు పక్కన పెట్టి ప్రజాపాలన సాగించాలని కోరుతున్నారు.



పనిచేయని నీటిశుద్ధి యంత్రాలు



శివసాగర్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఎప్పుడూ లొల్లినే...

ఇదిలా ఉంటే వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేష్ పదవి చేపట్టి నాలుగేళ్లు గడుస్తున్నా ఏడాదిపాటే యథేచ్ఛగా పాలన అందించారు. అనంతరం అప్పటి ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో వైరం పెరిగి పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. గత ప్రభుత్వంలోను మున్సిపాలిటీకి పెద్దగా నిధులు మంజూరుకాకపోవడంతో పాటు, ఎన్నికల కోడ్‌తో ఎలాంటి అభివృద్ధి జరుగలేదు. అనంతరం మునిసిపల్ చైర్‌పర్సన్ పార్టీ మారినప్పటికీ కాంగ్రెస్‌లో కొద్ది రోజుల్లోనే గ్రూపు రాజకీయాలు మళ్లీ తెరపైకి వస్తున్నాయి. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మునిసిపల్ చైర్ పర్సన్ మంజులరమేష్ మధ్య లోలోపల జరుగుతున్న కోల్డ్‌వార్ జరుగుతోందని జోరుగా ప్రచారం జరుగుతుంది. మునిసిపల్ వ్యవహారాల్లో, పార్టీ వ్యవహారాల్లో తమదే పెత్తనం సాగాలంటే తమదే సాగాలనే ధోరణిలో ఇరువురు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఏదీ ఏమైనా గొడవలు, గ్రూపు రాజకీయలు పక్కన పెట్టి ప్రజా అవసరాలకు సంబంధించిన విషయాలపై దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

క్వారీ గుంతలో పడి యువకుడి మృతి

» పరిహారం చెల్లించాలంటూ కుటుంబసభ్యుల రాస్తారోకో

» గంటపాటు ట్రాఫిక్‌జామ్ ఇబ్బందులుపడ్డ ప్రయాణికులు



సాయి (ఫైల్)



శవంతో రాస్తారోకో చేస్తున్న సాయి బంధువులు

కొందుర్గు, మార్చి 26 : మండల కేంద్రం శివారులోని క్వారీ గుంతలో పడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. ఎస్సై కృష్ణయ్య కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన గుండ్లకాడి నర్సింలుకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు సాయి(26) సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. మంగళవారం నలుగురు స్నేహితులతో కలిసి మండల కేంద్రం శివారులో, గంగన్నగూడెం రోడ్డు పక్కన ఉన్న క్వారీ గుంతలో ఈతకు వెళ్లాడు. ఈక్రమంలో సాయి నీళ్లలో మునిగి ఎంతకూ బయటకు రాలేదు. విషయం తెలుసుకున్న స్నేహితులు అరుపులు, కేకలు వేయడంతో అక్కడే క్రషర్ పనులు చేసే కొందరు వచ్చి గుంతలోకి దిగి చూశారు. అప్పటికే సాయి చనిపోయాడు. అనంతరం శవాన్ని బయటకు తీశారు. క్రషర్ యాజమాని గుంత ఎక్కువ లోతు తీయడంతోనే సాయి మృతిచెందాడని కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించారు. శవంతో మండల కేంద్రం చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో చేశారు. సాయి కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. క్రషర్ యాజమని వచ్చేంత వరకు శవాన్ని ఇక్కడి నుంచి తీసేదిలేదని భీష్మించారు. దాంతో షాద్‌నగర్, పరిగి వైపుతో పాటు నవాబ్‌పేట్ వైపు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దాదాపు గంట పాటు బస్సుల్లోని ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చివరకు పోలీసులు మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పి ధర్నాను విరమింపజేశారు. సాయి తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



క్రషర్ క్వారీ గుంత

మంచి ఆలోచనా విధానంతోనే ఆరోగ్యం

» కోఠి మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ వినితా పాండే



ప్రొఫెసర్ వినితాపాండేను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 26: మంచి ఆలోచన విధానంతోనే ఆరోగ్యం, ఆనందం, ఆనందం లభిస్తుందని కోఠి మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ వినితాపాండే అన్నారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం ఇంటర్నేషనల్ హ్యాపీనెస్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంతోషంగా ఉండాలంటే ఆలోచన సరళి మార్చుకోవాలన్నారు. తాత్కాలిక ఆనందం కోసం వెళ్లకుండా జీవిత విజయాల వైపు ముందుకు సాగాలన్నారు. సామాజిక కార్యక్రమాలు చేయడం వల్ల మానవత్వంతో పాటు సంతోషాన్ని కలిగిస్తాయన్నారు. ఆనందంగా ఉన్నవారు చదువుల్లో, ఉద్యోగాల్లో రాణిస్తారని గుర్తుచేశారు. అనంతరం ఆమెను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మానసిక నిపుణులు మహీపతి శ్రీనివాస్‌రావు, ఫార్మసీ డీన్ వసుధభక్షి, అధ్యాపకులు కృష్ణప్రసాద్, సునంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

3లక్షల ఓట్ల మెజారిటీతో గెలిపించాలి

» బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

దోమ, మార్చి 26: చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిని 3లక్షల ఓట్ల మెజారిటీతో గెలిపించాలని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మోత్కూర్ గ్రామంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దోమ మండలంలోని ప్రతీ గ్రామంలో ఐదు సార్లు తిరిగానని అన్నారు. ప్రస్తుత ఎంపీ కనీసం ఒక్కసారైనా వచ్చాడా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఓట్లు బీఆర్‌ఎస్‌పై కోపంతో వేశారే తప్ప ప్రేమతో కాదన్నారు. ప్రస్తుతం బీజేపీకి మంచి అనుకూల వాతావరణం ఉందన్నారు. కార్యకర్తలందరూ కలిసికట్టుగా పని చేస్తూ తనను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద్‌రావు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారుతి కిరణ్, మండల అధ్యక్షుడు అనంతయ్య, రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, అసెంబ్లీ ప్రభారి పోరెడ్డి నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, అయినాపూరం యాదయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వివేక్‌రెడ్డి, యువ నాయకులు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, మండల కార్యదర్శి నర్సింహ, కేపీ రాజు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌పై కోపంతో కాంగ్రెస్‌కు ఓటు వేశారు

పూడూరు: ప్రజలకు టీఆర్‌ఎస్ పార్టీపై ఉన్న కోపంతో కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి గెలిపించారని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మన్నెగూడలో మంగళవారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వేసిన ఓట్లు ప్రేమతో కాదని, బీఆర్‌ఎస్ పార్టీపై ఉన్న కోపంతోనే అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీజేపీకి అనుకూలమైన వాతావరణం ఉందని, కార్యకర్తలంతా కలిసి చేవెళ్ల గడ్డపై కాషాయం జెండా ఎగురవేయడం ఖాయన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, మండల అధ్యక్షుడు రాఘవేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యులు మల్లేష్ పటేల్, జిల్లా ఉపాధ్యక్షుడు వివేక్‌రెడ్డి, యువ నాయకులు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటయ్య, మహిళా మోర్చా నాయకురాలు మాధవి పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ అభివృద్ధి

కులకచర్ల: బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని, పార్టీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కులకచర్లలోని విజయ్‌చంద్ర ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన కులకచర్ల, చౌడాపూర్ మండలాల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కార్యకర్తలందరూ కలిసికట్టుగా పని చేసి చేవెళ్ల పార్లమెంట్ గడ్డపై కాషాయం జెండా ఎగరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద్‌రావు, జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతికిరణ్ బూనెటి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, పార్టీ నాయకులు ఆంజనేయులు, వెంకటయ్య, మైపాల్, బందెయ్య, సురేశ్, జానకిరామ్, సౌమ్య వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో వేదికమీదున్న ప్రజాప్రతినిధులను నిలదీస్తున్న రైతులు

సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

» జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్, మార్చి 26: ఘట్‌కేసర్ సహకార సంఘం అభివృద్ధికి పాలక వర్గం, రైతులు సమష్టిగా కృషి చేయాలని మేడ్చల్ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని నారాయణ గార్డెన్‌లో మంగళవారం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అధ్యక్షతన సహకార సఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. చిన్నచిన్న విషయాలకే రైతులు ఆందోళనకు దిగడం సరికాదన్నారు. రెండు సంవత్సరాలుగా సమావేశాల్లో ఇదే తరహాలో గలాటా జరగడం పరిపాటిగా మారిందన్నారు. సంఘం కార్యాలయంలో ఎండీ సమస్యలపై స్పందించకుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఘట్‌కేసర్ సహకార సంఘం రాష్ట్రంలోనే నెంబర్ వన్ సొసైటీగా మార్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘానికి గోదాంల నిర్మాణ పనులకు ప్రభుత్వం నుంచి స్థలాన్ని ఇప్పించడానికి ప్రయత్నిస్తున్నామని, సరైన స్థలం లేక ఆలస్యమవుతోందని వివరించారు.

అధిక వడ్డీ వసూళ్లపై రైతుల ఆగ్రహం

సహకార సంఘంలో అధిక వడ్డీ వసూళ్లపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ బ్యాంకుల కంటే అధికంగా వడ్డీలు వసూలు చేయడమేంటని మండిపడ్డారు. దీంతో అధికారులు, చైర్మన్ స్పందిస్తూ సహకార సంఘంలో రైతులకు ఎప్పుడంటే అప్పుడు రుణ సదుపాయం లభిస్తుందని చెప్పారు. రైతుల అభివృద్ధి కోసమే సహకార సంఘం పనిచేస్తోందన్నారు. ఇంతలో కొందరు రైతులు లేచి డైరెక్టర్ల ప్రయాణ ఖర్చుల కింద రూ.2.10లక్షలు ఎలా ఖర్చు చేస్తారని పాలకవర్గాన్ని నిలదీశారు. చైర్మన్, ఎండీ సమాధానాలకు సంతృప్తి చెందని రైతులు మూకుమ్మడిగా వేదికవైపు దూసుకువచ్చారు. సంఘంలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ఆరోపించారు. రైతులంతా ఒక్కసారిగా ప్రశ్నల వర్షం కురిపించారు. సంఘంలో సభ్యత్వమున్న రైతులు మృతిచెందితే రూ.10వేల ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పినప్పటికీ అనేక కుంటిసాకులు చెబుతూ ఆర్థిక సాయం అందించడంలేదని రైతులు ఆరోపించారు. ఇంతలో జడ్పీ చైర్మన్, సహకార సంఘం చైర్మన్లు కలగజేసుకుని రైతులను శాంతింపజేశారు. సంఘంలో ఎలాంటి అక్రమాలు జరిగినట్లు నిరూపించినా రాజీనామా చేసి వెళ్లిపోతానని చైర్మన్ రాంరెడ్డి అన్నారు. ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఘట్‌కేసర్ సహకార సంఘం లాభాలబాటలో ఉన్నప్పటికీ రైతులకు ప్రమాదబీమాను కల్పించడంలో పాలకవర్గం విఫలమైందని ఆరోపించారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిపట్ల రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయమై చైర్మన్ రాంరెడ్డి, ఎంపీపీ మధ్య కొంతసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోఠి రిజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రఘునాథ్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారిణి సునీతారాణి, వైస్‌చైర్మన్ బద్దం అనంతరెడ్డి, మాజీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, రవి, మేనేజర్ కరుణాకర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మహేందర్‌రెడ్డి

షాబాద్, మార్చి 26 : లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని సీఎం నివాసంలో మండలానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిసారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పినట్లు మహేందర్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

చేవెళ్ల : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నగరంలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సీఎం, చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో సమావేశం నిర్వహించారు. చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభారత్‌ల ఆధ్వర్యంలో చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి పార్టీ ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి తరలివెళ్లారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకుని ముందుకు సాగాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు నాయకులు చెప్పారు. చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఐదు మండలాలోని పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు ఉన్నారు.


వేలంలో పాల్గొన్న ఈవో శ్రీనివాస శర్మ, తదితరులు

ఆలయ భూముల వేలం

● 112 ఎకరాలకు రూ.7లక్షల 75 వేలు

కొందుర్గు, మార్చి 26: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవాలయం ఆవరణలో మంగళవారం దేవాలయ భూములను మూడు సంవత్సరాలకు వేలం వేశారు. మండల కేంద్రంలో సాగుకు యోగ్యమైన 112 ఎకరాల భూమిని కౌలుకు వేలం వేయగా 8 మంది రైతులు ఏడు లక్షల డెబ్బై ఐదు వేల రూపాయలకు వేలం పాడారు. గంగన్నగూడెంలో ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ భూములను త్వరలోనే వేలం వేయనున్నట్లు ఈవో శ్రీనివాస శర్మ తెలిపారు. వేలంలో శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కావలి యాదయ్య, చేవెళ్ల కృష్ణయ్య, కె.రామయ్యగౌడ్, కె.శ్రీశైలం, సత్యనారాయణ, జీబీ కృష్ణ, జి.ప్రసాద్, మల్లేష్, బి.యాదయ్య, కె. ప్రవీణ్, జె.బాల్‌రాజ్, వేణుగోపాల్, కె.వెంకటయ్య, శ్రీనివాస్, అశోక్, లింగం, చంద్రయ్య, సంతోష్, నర్సింలు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

ఇబ్రహీంపట్నం, మార్చి 26 : ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నవత ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నేడు(బుధవారం) జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.కె.ప్రభు తెలిపారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులతోపాటు ఇంటర్ చదివిన వారు మేళాకు హాజరుకావచ్చని చెప్పారు. ఎస్సెస్సీ, ఇంటర్ మెమోతోపాటు అన్ని సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమాన్ని తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ కోఆర్డినేటర్ డా.పి.విజయలక్ష్మి, కెరీర్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ డా.పి.రజిత నిర్వహిస్తారని చెప్పారు. రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు 9010912527, 9381065920, 9100205245 లను సంప్రదించాలని తెలిపారు.

ధర్మసమాజ్ పార్టీ మండల కన్వీనర్‌గా శివకుమార్



కేశంపేట, మార్చి 26: ధర్మసమాజ్‌పార్టీ(డీఎస్పీ) కేశంపేట మండల కన్వీనర్‌గా కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన శివకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన మంగళవారం తెలిపారు. జిల్లా కన్వీనర్ గంట్లవెల్లి రాకేష్, రాష్ట్ర నాయకులు మంచాల బిక్షపతి, జిల్లా కో కన్వీనర్ నర్సింహల సమక్షంలో కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. మండలి ఇన్‌చార్జిగా రమేష్ మహరాజ్, కో-కన్వీనర్లుగా మహిపాల్, మల్లేష్, రవి, కోశాధికారిగా జగదీష్, మీడియా ఇన్‌చార్జిగా నరేష్, కార్యవర్గ సభ్యులుగా కృష్ణ, పురుషోత్తం, విష్ణు, శ్రీకాంత్‌లను ఎన్నుకున్నాట్లు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరిస్తామని ఆయన వివరించారు.

రైతులను ఆదుకోండి : ఎంపీటీసీ


తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ లక్ష్మమ్మ తదితరులు

యాచారం, మార్చి 26 : మొండిగౌరెల్లి గ్రామంలో 19, 68, 127 సర్వేనెంబర్లలోని భూములను ప్రభుత్వం సర్వే చేస్తోందని, ఆ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులను ఆదుకోవాలని ఎంపీటీసీ తాండ్ర లక్ష్మమ్మ రెవెన్యూ అధికారులను కోరారు. ఈమేరకు మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి ఆమె తహసీల్దార్ టి.అయ్యప్పకు వినతిపత్రం అందించారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగకుండా చూడాలని పేర్కొన్నారు. చాలామంది రైతులకు పాస్‌బుక్‌లు లేవని, కాస్తులో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. భూములను సాగుచేసుకుంటున్న రైతులకు నేటికీ రైతుబంధు, రైతుబీమా వర్తించడం లేదన్నారు. అధికారులు విషయంలో రైతుల పక్షాన ఉండి ఆదుకోవాలన్నారు.

వందశాతం పన్నుల వసూళ్లే లక్ష్యం

● చేవెళ్ల డీఎల్పీవో సతీష్‌రెడ్డి


మాట్లాడుతున్న చేవెళ్ల డీఎల్పీవో సతీష్‌రెడ్డి

చేవెళ్ల, మార్చి 26 : అన్ని గ్రామాల్లో వందశాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా పనిచేయాలని డీఎల్పీవో సతీష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చేవెళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ చేవెళ్ల డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో వందశాతం ఇంటిపన్ను వసూళ్లు చేయాలని కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. కొన్ని చిన్న గ్రామాల్లో వందశాతం పన్నులు వసూలైనట్లు చెప్పారు. చేవెళ్ల మండలంలో రూ.కోటీ 91లక్షల 13వేల 111 పన్నుల వసూళ్లే లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ.కోటీ 62లక్షల 4వేల 614 వసూలైనట్లు చెప్పారు. అలాగే షాబాద్ మండలంలో లక్ష్యం రూ.కోటీ 3లక్షల 16వేల 994 కాగా, రూ.82లక్షల 44వేల 484 వసూలైనట్లు చెప్పారు. మొయినాబాద్ మండలంలో రూ.4కోట్ల 57లక్షల 80వేల 658 లక్ష్యం కాగా, రూ.3కోట్ల 51లక్షల 51వేల 720 వసూలయ్యాయి. శంకర్‌పల్లి మండలంలో రూ.3కోట్ల 57లక్షల 87వేల 70లకు గాను రూ. 2కోట్ల 63లక్షల 65వేల 450 వసూలయ్యాయి. శంషాబాద్ మండలంలో లక్ష్యం రూ.2కోట్ల 95లక్షల 29వేల 87 కాగా, రూ. 2కోట్ల 50లక్షల 81వేల 362 వసూలు చేసినట్లు చెప్పారు. ఈ నెలాఖరు వరకు వందశాతం పన్నులు వసూళ్లు చేయాలని కార్యదర్శులను డీఎల్పీవో ఆదేశించారు. ఇంటిపన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. గ్రామాల్లోని ప్రజలు సైతం గ్రామ పంచాయతీ అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో చేవెళ్ల ఎంపీవో విఠలేశ్వర్, చేవెళ్ల గ్రామ కార్యదర్శి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం


మాట్లాడుతున్న చైర్మన్ రాజేందర్‌రెడ్డి

యాచారం, మార్చి 26 : రైతులను తాము అన్ని విధాలా ఆదుకుంటామని, త్వరలో ఎరువుల గోదాం ప్రారంభించి ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతామని యాచారం సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం యాచారం తమండల సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు సొసైటీలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. ఇప్పటికీ కేవలం 26శాతం రుణాలు మాత్రమే బకాయిలు చెల్లించారన్నారు. గతేడాది కంటే ఈ సారి చాలా తక్కువగా రుణాలు వసూలైనట్లు చెప్పారు. బకాయిల వసూలులో వేగం పెంచడంపై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బంగారు ఆభరణాలపై రుణాలందిస్తున్నామని, సొసైటీలో మీ సేవ మాదిరిగా అన్నిరకాల సేవలందించడం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సొసైటీలో రూ.43కోట్ల77లక్షల అంచనా బడ్జెట్ రూపొందించామన్నారు. బ్యాంకులో ఇప్పటివరకు రూ.14కోట్ల 27లక్షల ఆరువేల బ్యాంక్ డిపాజిట్లున్నాయన్నారు. సొసైటీలో కోళ్లఫారం, పాడిపశువులు, గొర్రెలు, మేకల పెంపకం కోసం 155 మంది రైతులకు రూ.54కోట్ల92లక్షల32వేల రుణాలందించామని చెప్పారు. ఇవి కాకుండా స్వల్పకాలిక రుణాలు 1632 మంది రైతులకు రూ.పది కోట్ల16లక్షల 30వేల రుణాలందించామని తెలిపారు. తాము సొసైటీని జిల్లాలో ఆదర్శ సొసైటీగా మార్చడం కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. యువకులు కూడా బ్యాంక్‌లో డిపాజిట్లు పెట్టడంతో పాటు నూతనంగా ఖాతాలు తెరవాలన్నారు. రుణమాఫీ విషయంలో తాము క్లారిటీగా ప్రతి రైతుకు రుణమాఫీ చేయించామన్నారు. ఎరువుల కొనుగోలు విషయంలో ఆధార్ కార్డు విధిగా చూపాలని మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ యాదయ్య, సీఈవో నాగరాజుతో పాటు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

యువకుల మృతి దురదృష్టకరం : ఎమ్మెల్యే సబితారెడ్డి


నందుపల్లిలో సురేందర్ మృతదేహంపై పూలమాల ఉంచుతున్న సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, మార్చి 26 : పండుగవేళ ఒకే గ్రామంలో ఇద్దరు యువకులు ఈతకు వెళ్లి నీటమునిగి మృతిచెందడం బాధాకరమని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. హోలీ సందర్భంగా మండల పరిధిలోని నందుపల్లి గ్రామంలో సోమవారం సంగం జగన్ (27), కొమ్ము సురేందర్ (29)అనే ఇద్దరు యువకులు చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందారు. ఈమేరకు వారి కుటుంబాలను మంగళవారం ఆమె పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు రాజునాయక్, పాండుయాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, డి.శ్రీనివాస్, రామ్‌రెడ్డి, రమేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు పనికి తగిన వేతనం చెల్లించాలి


ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న బీకేఎంయూ నాయకులు

షాద్‌నగర్, మార్చి 26 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేస్తున్న కూలీలకు పనికి తగిన వేతనం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని వనంపల్లి గ్రామంలో కొనసాగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. ఎన్నో పోరాటాలు చేసి పేదల వలసల నివారణ కోసం గ్రామీణ స్థాయిలో పని కావాలని సాధించుకున్న పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధుల కోత విధించి పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తీసివేసి, రెండు పూటలా మస్టర్ తీసుకోవడం, ఆధార్ అనుసంధానం చేయడం, క్యూబిక్ మీటర్ లెక్కన పనులు చేయిస్తూ ఒత్తిడికి గురిచేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూలీలను ఇబ్బందులకు గురిచేస్తుందని మండిపడ్డారు. పని చేసే సమయంలో అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పని ప్రదేశాల్లో తగిన సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కొలతలతో సంబంధం లేకుండా కూలీలకు రోజుకు రూ.600 చెల్లించి, రెండు వందల రోజుల పని కల్పించాలని, లేనియెడల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సీపీఐ మండల కార్యదర్శి వెంకటేష్, అనంతయ్య, యాదయ్య, రమేష్, బుచ్చయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులను సద్వినియోగం చేసుకోవాలి

తలకొండపల్లి : ఈజీఎస్ పనులను కూలీలు సద్వినియోగం చేసుకొని స్థానికంగా ఉపాధి పొందాలని జిల్లా మత్స్య పారిశ్రామిక శాఖ అధ్యక్షుడు టి. వెంకటయ్య కోరారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశాల్లో కూలీలకు తగిన వసతులు కల్పించాలని కోరారు. తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామంలో మంగళవారం ఈజీఎస్ పనులను వెంకటయ్య ప్రారంభించారు. పనుల్లో కూలీల సంఖ్యను పెంచి పనులు వేగవంతంగా చేపట్టాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచించారు. వ్యవసాయ పనులకు ఈజీఎస్‌ను అనుసంధానం చేయాలని తద్వారా రైతులకు మేలు జరుగుతుందని వెంకటయ్య అన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహ, క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న వెంకటయ్య

చందన్‌వెల్లి భూ నిర్వాసితులకు న్యాయం చేయండి


రేవంత్‌కు వినతిపత్రమిస్తున్న చేవెళ్ల స్వామి

షాబాద్, మార్చి 26 : చందన్‌వెల్లిలోని సర్వేనెంబర్ 190లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై రైతులకు న్యాయం చేయాలని మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి నగరంలో ఆయన నివాసంలో చేవెళ్ల స్వామి ఆధ్వర్యంలో భూనిర్వాసితులు వినతిపత్రం అందజేశారు. తమకు న్యాయం చేయాలని గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు ధర్నాలు చేశామని, అయినా న్యాయం జరగలేదన్నారు. నష్టపోయిన రైతులను గుర్తించి వెంటనే పరిహారం అందించాలని పేర్కొన్నారు. భూసేకరణ జరిగినప్పుడు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ ఇంటికి ఒక ఉద్యోగం, స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ప్లాట్లు ఇస్తామని చెప్పి అవికూడా ఇవ్వలేదని వాపోయారు. స్పందించిన రేవంత్‌రెడ్డి విచారణ చేసి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

కందుకూరు/చేవెళ్ల : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని, హస్తం అభ్యర్థుల గెలుపునకు ప్రతీ కార్యకర్త, నాయకులు సమష్టిగా పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు నిచ్చారు. చేవెళ్ల అభ్యర్థిగా గడ్డం రంజిత్‌రెడ్డిని ప్రకటించడంతో మంగళవారం మహేశ్వరం నియోజకవర్గస్థాయి నాయకులతో పాటు కందుకూరు మండల కాంగ్రెస్ నేతలు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి సమక్షంలో నగరంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. చేవెళ్ల రంజిత్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి మండల నాయకులు ముంగి జైపాల్‌రెడ్డి, ఎస్.కృష్ణానాయక్, సరికొండ మల్లేష్, బొక్క భూపాల్‌రెడ్డి, ఎండి అఫ్జల్‌బేగ్, నర్సింహాచారి, కె.రాణాప్రతాప్‌రెడ్డి, సరికొండ జగన్, బుక్క పాండురంగారెడ్డి, ప్రభాకర్, గణేష్‌నాయక్, తదితరులున్నారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి

చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలతో భేటీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. నియోజక వర్గ ఇన్‌చార్జి తొర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నేతలంతా సమావేశంలో పాల్గొన్నారు. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ సీఎం మాటకు కట్టుబడి ఉన్నామని, లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ స్థానం కైవసం చేసుకుంటుందన్నారు. మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్‌ను సీఎం ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని శంషాబాద్ మండలంలో భారీ మెజార్టీ ఇచ్చేలా కృషి చేయాలని కోరారు. సీఎం మాట నిలబెడతామని శేఖర్‌యాదవ్ అన్నారు. నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మినీస్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన

కొందుర్గు, మార్చి 26: మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం కోసం స్పోర్ట్స్ అథారిటీ ఓఎస్డీ రవీందర్‌రెడ్డి మంగళవారం మండల కేంద్రం శివారులోని ఏనెగడ్డ మీద స్థల పరిశీలన చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొందుర్గు మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు కోసం ఇటీవల సంబంధిత శాఖ అధికారులను కలిశారు. ఈమేరకు రవీందర్‌రెడ్డి 11 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. కాగా, ఎన్నికల కోడ్ అనంతరం కొందుర్గులో మినీ స్టేడియం పనులు మొదలు కానున్నాయి.

29న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

తలకొండపల్లి, మార్చి 26 : మండలంలోని దేవుని పడకల్ గ్రామంలో ఈనెల 29, 30న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.మల్లేశ్, ఆర్. తిరుపతిలు తెలిపారు. గ్రామంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పోటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండవ బహుమతి రూ.20 వేలు, మూడవ బహుమతి రూ.10వేలు, నాల్గవ బహుమతి రూ.5వేలు, మహిళల ఓపెన్ కేటగిరిలో మొదటి బహుమతి రూ.20వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు అందివ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తిగలవారు రూ.300 ఎంట్రీఫీజు చెల్లించాలని తెలిపారు.

విద్యార్థులకు ఎన్ఆర్ఐ ఆర్థిక సాయం

మాడ్గుల, మార్చి 26 : చదువులో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఎన్ఆర్ఐ సూదిని రవిందర్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. మండల కేంద్రంలోని పాఠశాలలో 2021-2022 సంవత్సరంలో పది, ఇంటర్‌లో టాపర్‌గా నిలిచిన పేద విద్యార్థుల గురించి ఉపాధ్యాయులు దేవయ్య, విష్ణులు సూదిని రవిందర్‌రెడ్డికి సమాచారం చేరవేశారు. దాంతో ఆయన రూ.30వేల ఆర్థిక సాయం పంపించారు. విష్ణు తెలిపారు. పదో తరగతిలో టాపర్‌గా నిలిచిన కాట్ల అంజలికి రూ.15వేలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీలో టాపర్‌గా నిలిచిన చిక్కుడు మానసకు రూ.15వేల చొప్పున సూదిని రవిందర్‌రెడ్డి పంపించారు. మండల కేంద్రానికి చెందిన పొలిచెట్టి సురేష్ రూ.4వేల ఆర్థిక సాయం అందించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈమేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు.

ఎన్ఎస్సీసీ సభ్యుడు రాంచందర్‌ను కలిసిన నాయకులు

తలకొండపల్లి, మార్చి 26: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌ను మంగళవారం ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లికి చెందిన ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహ, తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లికి చెందిన జిల్లా అధ్యక్షుడు జీనుకుంట్ల భాస్కర్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని జాగృతి భవన్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. దళితుల సంక్షేమ, గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం గురించి రాంచందర్‌కు వివరించగా సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. దళితులకు ఉద్దేశించిన పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని పేర్కొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం


విలేకరులతో మాట్లాడుతున్న వస్పుల జంగయ్య

ఆమనగల్లు, మార్చి 26: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని జిల్లా నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య అన్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం నాయకులు, కార్యకర్తలు విశ్రమించకుండా పోరాడాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జంగయ్య మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాల అమలుతో కాంగ్రెస్ ప్రజలకు మరింత చేరువైందన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలు కాంగ్రెస్ భారీ మెజార్టీతో కైవసం చేసుకుంటుందన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభివృద్ధికి కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి ఎనలేని కృషి సలిపారని జంగయ్య అన్నారు. బీజేపీని నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. నాయకులు అప్పం శ్రీను, వర్కాల శ్రీను, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

టిప్పర్ ఢీకొని బాలుడి దుర్మరణం


మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, బంధువులు; లోకేష్ (ఫైల్)

యాచారం, మార్చి 26 : హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకులమైలారం గ్రామంలో మంగళవారం సాయంత్రం టిప్పర్ ఢీకొని 14 ఏళ్ల బాలుడు దుర్మరణం చెందాడు. తమకు న్యాయం చేయాలని మృతుడి బంధువులు ఆందోళనకు దిగడంతో పరిస్థితి కాస్త ఉద్రిక్తంగా మారడంతో స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. ఆకులమైలారం గ్రామపంచాయతీ పరిధిలోని మాలగూడకు చెందిన చంద్రమ్మ, రాజు దంపతులకు ఇద్దరు కుమార్తెలు లోకేష్ సంతానం. కాగా, లోకేష్ మీర్‌ఖాన్‌పేట ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం తన తండ్రి బైక్‌పై ఇంటి పనిపై ఆకులమైలారం వెళ్లాడు. గ్రామంలోని మూలమలుపు వద్ద మైలమ్మ చెరువు నుంచి టిక్కి మట్టి తరలిస్తున్న టిప్పర్ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దాంతో లోకేష్ తలపగిలి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. బైక్‌ను టిప్పర్ డ్రైవర్ 200 గజాల దూరం వరకు లాక్కెళ్లాడు. భయానక పరిస్థితి చూసి స్థానికులు బిత్తెరపోయారు. మృతుడి బంధువులతో పాటు ఆకులమైలారం, మాలగూడ గ్రామాల ప్రజలు ఆకులమైలారంలో ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, మాడ్గుల సీఐ విష్ణువర్ధన్‌రెడ్డిలు సంఘటనా ప్రదేశానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. టిప్పర్ డ్రైవర్ మద్యం సేవించి డ్రైవింగ్ చేయడంతో ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, మృతుడి కుటుంబానికి రూ.5 సాయమందించనున్నట్లు టిప్పర్ యజమాని మంగళవారం రాత్రి హామీ ఇవ్వడంతో మృతుడి కుటుంబీకులు, బంధువులు ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్ష కోసం ఇబ్రహీంపట్నం సివిల్ ఆసుపత్రికి తరలించారు.

ఎయిర్‌టెల్ సెల్‌టవర్ 'ఆర్‌ఆర్‌యూ' అపహరణ

చేవెళ్ల, మార్చి 26 : ఎయిర్‌టెల్ సెల్‌టవర్ ఆర్‌ఆర్ (రిమోట్ రేడియో యూనిట్)ను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లిన సంఘటన సోమవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దగోల్కొండ ఎయిర్‌టెల్ సెల్‌టవర్ ఆర్‌ఆర్‌యూను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి సెల్‌టవర్ ఎక్కి అపహరించినట్లు పోలీసులు తెలిపారు. ఎయిర్‌టెల్ అధికారులు శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేశారు. ఆర్‌ఆర్‌యూ విలువ దాదాపు రూ.2లక్షల ఉంటుందని చెప్పారు. తెలిసినవారే ఆర్‌ఆర్‌యూను దొంగిలించి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్..

● దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ నారాయణరెడ్డి

షాద్‌నగర్ రూరల్, మార్చి 26: తాళాలు వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు శంషాబాద్ ఏసీపీ నారాయణరెడ్డి తెలిపారు. షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లా వైజాపూర్ తాలూకా గోల్వాడి గ్రామానికి చెందిన రజ్బీర్ శంకర్ పవార్, నాగపూర్‌కు చెందిన అజయ్ సర్కాస్ పవార్, తుల్జాపూర్‌కు చెందిన అమూల్, గోల్వాడి గ్రామానికి చెందిన పవన్ మచ్చింద్ర కాలే, నాగ్‌పూర్ పార్ధికి చెందిన యెలవతిలు కలిసి తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా దోపిడీలకు పాల్పడినట్లు తెలిపారు. ఈనెల ఒకటిన ఇదే పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎలికట్ట గ్రామానికి చెందిన బెండి రాంరెడ్డి ఇంటికి తాళంవేసి భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న వారి కూతురు వద్దకు వెళ్లారు. తిరిగి 5వ తేదీన వచ్చి చూడగా మెయిన్ డోర్ తాళం విరగ్గొట్టి ఉంది. వెంటనే లోపలికి వెళ్లిచూడగా బీరువా తాళం విరగ్గొటి ఉంది. అందులో ఉన్న రూ.2.10 లక్షలు అపహరించుకెళ్లారు. అదేరోజు బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శంషాబాద్ ఏసీపీ నారాయణరెడ్డి, అడిషనల్ ఏసీపీ రాంకుమార్, సీసీఎస్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పవన్, సబ్ ఇన్‌స్పెక్టర్ అవినాశ్ ఆధ్వర్యంలో సిబ్బంది కేసును ఛేదించారు. నిందితులు షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే కాకుండా ఆమనగల్లు, కడ్తాల్, శంషాబాద్, పహడీషరీఫ్, నందిగామ, మహేశ్వరం, కందుకూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో దోపిడీలకు పాల్పడినట్లు ఏసీపీ తెలిపారు. కాగా, ఇప్పటివరకు 23 దోపిడీలకు పాల్పడినట్లు వారు చెప్పారు. రజ్బీర్ శంకర్ పవార్‌ను అదుపులోకి తీసుకుని అతడి నుంచి 30తులాల బంగారం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. మిగతా ముగ్గురు పరారీలో ఉండగా గాలిస్తున్నట్లు తెలిపారు.

రూ.15 వేల విలువైన మద్యం స్వాధీనం

ఆమనగల్లు, మార్చి 26 : మండల పరిధిలోని చింతలపల్లి గ్రామ సమీపంలో అనుమతి లేకుండా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై బాల్‌రామ్ నాయక్ తెలిపారు. తలకొండపల్లి మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన ఎండీ అస్రఫ్ మంగళవారం ఆమనగల్లు పట్టణం నుంచి స్కూటీపై గ్రామంలోని తన బెల్టుషాప్‌కు మద్యాన్ని తరిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్వోటీ పోలీసులు చింతలపల్లి వద్ద స్కూటీని తనిఖీ చేయగా మద్యం లభించింది. రూ.15 వేలు విలువచేసే మద్యం, స్కూటీని స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమంగా నిల్వ చేసినా, అనుమతులు లేకుండా విక్రయించినా చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

అప్పు చెల్లించలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఊర్కొండ, మార్చి 26 : తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేక ఓ వ్యక్తి గొంతు, చేతులు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రం శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లుకు చెందిన దుర్గేష్ ఏడు సంవత్సరాల నుంచి ఆమనగల్లు పట్టణంలో ఫొటోఫ్రేమ్ వర్క్ చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. అవసరాల కోసం ఒకరి వద్ద అప్పుగా రూ.30వేలు తీసుకున్నాడు. ఆ అప్పు తీర్చే క్రమంలో మరొకరి వద్ద అప్పు తీసుకున్నాడు. అప్పు ఇచ్చిన వారి కుటుంబంలో వివాహం ఉండటంతో అప్పు తిరిగి చెల్లించలేకపోతున్నానని మనస్తాపం చెందాడు. ఊర్కొండ-ఊర్కొండపేట మార్గమధ్యలో ఉన్న గుట్టలోకి వెళ్లి గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. గొంతుకైన గాయం బాధకు తాళలేక రోడ్డుపైకి వచ్చి కేకలు వేస్తూ కిందపడిపోయాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని అతడిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తూ బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా, ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.